# బాంబే డైయింగ్‌కు కొత్త రూపు

- బ్రాండింగ్‌పై రూ.100 కోట్ల పెట్టుబడులు
- 15-20% ఏపీ, తెలంగాణాలకు
- 2020 నాటికి రూ.1,000 కోట్ల టర్నోవరు లక్ష్యం

ఈనాడు, హైదరాబాద్: వస్త్ర ప్రపంచంలో చిర పరిచితమైన బాంబే డైయింగ్, తన వ్యాపార వ్యూహంలో మార్పులు చేస్తోంది. ఇందులో భాగంగా రూపు రేఖలు, బ్రాండింగ్‌ను మార్చుకుని యువతే లక్ష్యంగా ముందుకు అడుగులు వేయనుంది. ప్రస్తుతం రూ. 305 కోట్ల అమ్మకాలను నమోదు చేస్తున్న బాంబే డైయింగ్ 2020 నాటికి టర్నోవరును రూ. 1000 కోట్లకు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు బాంబే డైయింగ్ రిటైల్ సీఈఓ నగేశ్ రాజన్న తెలిపారు. పక్క దుప్పట్లు, బాత్ రూమ్ వస్త్రాలను ప్రధానంగా విక్రయిస్తున్న కంపెనీ తయారీ కార్యకలాపాల నుంచి తప్పుకోవాలని నిర్ణయించిందని, కేవలం మార్కెటింగ్‌పైనే దృష్టి పెడుతుందని వివరించారు. 'బ్రాండ్‌కు కొత్త గుర్తింపు తెచ్చేందుకు, మార్కెటింగ్‌కు 2020 నాటికి రూ. 100 కోట్లు ఖర్చు చేయనున్నాం. మాకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు కీలకమైనవి. బ్రాండింగ్‌పై చేసే మొత్తం ఖర్చులో 15-20 శాతాన్ని ఈ రెండు రాష్ట్రాలకే వెచ్చిస్తాం. పంపిణీదారుల నెట్‌వర్క్, సాంకేతిక పరిజ్ఞానం, సిబ్బందిపై కూడా పెట్టుబడులు పెట్టనున్నాం. ఫ్రాంఛైజీలను ప్రస్తుతమున్న 200 స్థాయి నుంచి 500కు పెంచుకుంటాం. కంపెనీకి ఉన్న సొంత రిటైల్ అవుట్‌లెట్లను ఎక్స్‌పీరియన్స్ కేంద్రాలుగా మారుస్తాం. ఆన్‌లైన్ విక్రయాలకు ఫిబ్రవరి లేదా మార్చిలో ఇ-కామర్స్ పోర్టల్‌ను ప్రారంభించనున్నాం. సామాజిక మీడియా ద్వారా యువత భావాలను తెలుసుకుంటాం. సంపన్నులు, అత్యంత సంపన్నుల కోసం ప్రత్యేక ఉత్పత్తులను తీసుకురానున్నాం. వచ్చే ఏడాది కాలంలో అంతర్జాతీయ డిజైనర్లతో చేతులు కలిపి కొత్త ఉత్పత్తులను విడుదల చేయనున్నామని' రాజన్న అన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ప్రస్తుతం 34 ఫ్రాంఛైజీలు ఉన్నాయని, వీటిని 2020 నాటికి 75కు పెంచుకుంటామని చెప్పారు. కంపెనీ మొత్తం ఆదాయంలో 10 శాతం ప్రస్తుతం ఈ రెండు రాష్ట్రాల నుంచి లభిస్తోందని, భవిష్యత్తులో దీన్ని 15 శాతానికి పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.




బాంబే డైయింగ్ రిటైల్ సీఈఓ
నగేశ్ రాజన్న